నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

I | హైదరాబాద్, గురువారం 16 జనవరి 2025 | RANGAREDDY


## 'బీఆర్ఎస్ పార్టీపై నమ్మకంతోనే చేరికలు'



మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న బీజేపీ నాయకులు

కడ్తాల్, జనవరి 15 : బీఆర్ఎస్ పార్టీపై ఉన్న నమ్మకంతోనే వివిధ పార్టీలకు చెందిన నాయకులు పార్టీలో చేరుతున్నారని మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. బీజేపీ కడ్తాల్ మండల ఉపాధ్యక్షుడు సరియానాయక్‌తోపాటు బూత్ కమిటీ అధ్యక్షులు వినోద్, హీర్యానాయక్, కిరణ్‌తోపాటు 10 మంది బీజేపీ నాయకులు బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు తులసీరాంనాయక్, భూనాథ్‌నాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ సేవ్యానాయక్, మాజీ ఉప సర్పంచ్ రమణ, నాయకులు రమేశ్, శ్రీను, సోమ్లా, దశరథ్, పత్యానాయక్, దేవా, రాజు, కిరణ్ పాల్గొన్నారు.

## దామస్తాపూర్‌లో ఘనంగా ఊరడమ్మ జాతర



బోనాలతో ఊరడమ్మ ఆలయం వద్ద మహిళలు

మర్పల్లి, జనవరి 15 : మండలంలోని దామస్తాపూర్ గ్రామంలో ఊరడమ్మ జాతర ఘనంగా జరిగింది. మూడు రోజులుగా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేయడంతో పాటు బుధవారం బోనాలు సమర్పించారు. ఊరడమ్మ అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.

# అటు ఆనందం..

# ఇటు ఆవేదన



శంకర్‌పల్లిలో..



వికారాబాద్‌లో..

## పల్లెలకు పండుగ కళ

ఉమ్మడి రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా సంక్రాంతి సంబురాలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఇష్టదైవాలకు నైవేద్యం సమర్పించి పంటలు బాగా పండి సంతోషంగా ఉండాలని వేడుకున్నారు. తెల్లవారుజామునే మహిళలు, యువతులు ఇండ్ల ముంగిట వేసిన రంగవల్లులు హరివిల్లులా దర్శనమిచ్చాయి. ఏ వీధిలో చూసినా.. ఏ పల్లెలో చూసినా డీజే మోతతో యువత, చిన్నారులు నృత్యాలు చేస్తూ కేరింతలతో ఆనందంగా గడుపడం కనిపించింది. చిన్నాపెద్ద తేడా లేకుండా పతంగులు ఎగురవేస్తూ ఎంజాయ్ చేశారు. బంధువులు, ఆడపడుచులు, అల్లుళ్ల రాకతో ప్రతి ఇంట సందడి నెలకొన్నది. గంగిరెద్దులు చేసిన విన్యాసాలు, హరిదాసుల కీర్తనలను ఆసక్తిగా వింటూ ఆనందించారు. పలు పల్లెల్లో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ముగ్గుల పోటీలను నిర్వహించి బిజీబిజీగా గడిపారు.

- న్యూస్ నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ




రోటిబండతండాలో



## సంబురం లేని సంక్రాంతి

ఫార్మా విలేజ్ గ్రామాలు లగచెర్ల, పోలెపల్లి, హకీంపేట, రోటిబండతండా, పులిచెర్లకుంట తండాల్లో సంక్రాంతి సంబురం ఆవిరైంది. ఏ బాధిత పల్లెలో చూసినా తమపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని రాసిన రంగవల్లులే కనిపించాయి. లగచెర్ల ఘటన కేసుకు సంబంధించి ఎప్పుడు ఎటువంటి వార్త వినాల్సి వస్తుందోనని భయం.. భయంగా గడుపుతున్నారు. కేసులు ఎత్తివేస్తే వచ్చే ఏడాది సంక్రాంతి సంబురాలు చేసుకుంటామని ఇష్టదైవాలను వేడుకున్నారు. ఇప్పటికైనా సీఎం మనస్సు కరుగాలని ఆలయాల్లో పూజలు చేశారు. సంక్రాంతి పండుగకు కష్టపడి పండించిన పంట ఇండ్లకు చేరేదని, లగచెర్ల ఘటనతో పంటలను కోయక నేలపాలైందని కన్నీరు పెట్టుకొన్నారు. ఆర్థికంగా చితికిపోయామని, తమను ఆదుకునే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తమ బాధలను గుర్తించి అక్రమంగా పెట్టిన కేసులు ఎత్తివేయడంతో పాటు భూ సేకరణ నిలిపివేయాలని కోరారు.

- కొడంగల్, జనవరి 15



- పెండింగ్‌లోనే రూ.640 కోట్ల చెల్లింపులు
- పత్తి విక్రయించిన రైతులకు రెండు నెలలు దాటినా అందని డబ్బులు
- సీసీఐ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు
- 54 వేల మంది రైతుల నుంచి రూ.932 కోట్ల విలువైన పత్తిని కొనుగోలు చేసిన సీసీఐ
- కేవలం రూ.292 కోట్ల చెల్లింపులు మాత్రమే పూర్తి..
- జిల్లావ్యాప్తంగా 14 పత్తి కొనుగోలు కేంద్రాలు
- ఈనెలాఖరు వరకు కొనుగోలు కేంద్రాలలో పత్తి సేకరణకు చర్యలు



# కష్టాల్లో పత్తి రైతు

*జిల్లాలో పత్తి రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. పత్తి విక్రయించే సమయంలో ఏదో ఒక కొర్రీలు పెట్టిన సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) డబ్బులు చెల్లించడంలోనూ తీవ్ర ఇబ్బందులు పెడుతున్నది. ఐదారు రోజుల్లోగా పత్తిని విక్రయించిన రైతులకు చెల్లింపులు పూర్తి చేస్తామంటూ సీసీఐ అధికారులు చెబుతున్నప్పటికీ రెండు నెలలు దాటినా డబ్బులు చేతికి అందక రైతులు కష్టాలు పడుతున్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల సిబ్బంది నిర్లక్ష్యం వల్లే డబ్బులు జమ కావడంలో జాప్యం జరుగుతున్నట్లు మార్కెటింగ్ అధికారులు చెబుతున్నారు. కొందరు రైతుల ఆధార్ బ్యాంకు ఖాతాలకు లింక్ కాకపోవడం, ఆధార్ మ్యాపింగ్ లేపోవడం తదితర కారణాలతో చెల్లింపుల్లో జాప్యం జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు జిల్లాలో ఇప్పటివరకు రూ.932 కోట్ల విలువైన పత్తిని సేకరించగా, ఇప్పటివరకు రూ.292 కోట్ల చెల్లింపులను మాత్రమే సీసీఐ జమ చేసింది. రూ.640 కోట్ల బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. గత రెండు నెలల నుంచి ఈ నెల 10 వరకు పత్తిని విక్రయించిన 54 వేల మంది రైతులకుగాను సుమారు 10 వేల మంది రైతులకు మాత్రమే రూ.292 కోట్లు చెల్లించారు. ఇప్పటికే పలు పత్తి కొనుగోలు కేంద్రాలను మూసివేసిన సీసీఐ అధికారులు, ఈ నెలాఖరులోగా మిగతా కొనుగోలు కేంద్రాలను మూసివేసేందుకు చర్యలు చేపట్టారు. జిల్లాలో ఈ ఏడాది 2.40 లక్షల ఎకరాల్లో పత్తి సాగు కాగా, 2 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రానున్నదని అధికారులు అంచనా వేశారు.*

*- వికారాబాద్, జనవరి 15 (నమస్తే తెలంగాణ)*

### జిల్లావ్యాప్తంగా 1,25,677 మెట్రిక్ టన్నుల పత్తి సేకరణ...

జిల్లావ్యాప్తంగా 14 పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. తాండూరులో మారుతీ, శుభం, బాలాజీ కొనుగోలు కేంద్రాలు, కోట్‌పల్లిలో సాయిబాబా కాటన్ అగ్రో ఇండస్ట్రీస్, పరిగిలో లక్ష్మీ వేంకటేశ్వర, నరసింహ, రాకంచర్ల కాటన్‌మిల్, వికారాబాద్‌లో ధరణి, సాయిబాబా, అయ్యప్ప జిన్నింగ్ మిల్లు, మర్పల్లిలో శ్రీఅయ్యప్ప కాటన్ ట్రేడర్స్, కొడంగల్‌లో విజయ్ ఇండస్ట్రీస్ జిన్నింగ్ మిల్లులో సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది 2 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి వస్తుందని అధికారులు అంచనా వేయగా, ఇప్పటివరకు 1.25 లక్షల మెట్రిక్ టన్నుల పత్తిని 54 వేల మంది రైతుల నుంచి కొనుగోలు చేశారు. అంచనాలకు తగినట్లుగా కొనుగోలు కేంద్రాలకు ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. పత్తిని విక్రయించిన రైతులు డబ్బుల కోసం సీసీఐ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. రెండు నెలలు దాటినా డబ్బులు రావడం లేదని కొందరు రైతులు ప్రైవేటు మార్కెట్‌లోనే విక్రయిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో రూ.100 తక్కువ వస్తున్నా.. వెంటనే డబ్బులు చేతికొస్తుండడంతో కొందరు రైతులు ప్రైవేటు వ్యాపారులకు అమ్మేందుకు మొగ్గుచూపుతున్నారు. జిల్లావ్యాప్తంగా 14 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఇప్పటికే 8 కొనుగోలు కేంద్రాలను అధికారులు మూసివేశారు. వికారాబాద్, కోట్‌పల్లి, ధారూరులోని కాటన్ మిల్లులో పత్తి కొనుగోలు ప్రక్రియ కొనసాగుతున్నది. మొదట క్వింటాలుకు రూ.7521లకు పత్తిని సేకరించగా, ప్రస్తుతం రూ.7421లకు కొనుగోలు చేస్తున్నారు.

### చెల్లింపులు అయ్యేలా చర్యలు...

పత్తిని విక్రయించిన రైతులకు త్వరగా చెల్లింపులు పూర్తయ్యేలా సీసీఐ అధికారులకు సూచిస్తాం. బిల్లులు, ఆధార్ మ్యాపింగ్ లేకపోవడం బ్యాంకు లింకేజీ సమస్యలతో చెల్లింపులు జాప్యం జరుగుతున్నది. ఆయా కారణాలతో వెనక్కి వస్తున్న బిల్లులకు సంబంధించి మళ్లీ బిల్లులు చేసి సీసీఐకి పంపిస్తున్నాం.

– సారంగపాణి, జిల్లా మార్కెటింగ్ అధికారి

## అభ్యంతరాలకు నేడే ఆఖరు

**ఫార్మాలో రైతులకు డ్రా పద్ధతిలో ప్లాట్ల పంపిణీకి సర్వం సిద్ధం..**

రంగారెడ్డి, జనవరి 15 (నమస్తేతెలంగాణ) : ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతులకు డ్రా పద్ధతిన ప్లాట్లు కేటాయించడానికి సర్వం సిద్ధమైంది. ఎకరాకు 120 గజాల చొప్పున ప్లాట్లు కేటాయిస్తామని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించింది. అందులో భాగంగానే ఫార్మా రైతులకు గతంలోనే అప్పటి ప్రభుత్వం ప్లాట్ల సర్టిఫికెట్లనూ అందజేసింది. సర్టిఫికెట్లు అందుకున్నవారికి త్వరలోనే డ్రా పద్ధతిన ప్లాట్లు కేటాయించడంతో పాటు ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ చేసి ఇస్తుందని ప్రకటించింది. ఇందుకోసం ప్రభుత్వం ఫార్మాలో భూములు కోల్పోయిన రైతుల వివరాలను ఆయా గ్రామపంచాయతీల్లో నోటీసు బోర్డుపై పెట్టారు. ఫార్మా భూములు కోల్పోతున్న రైతుల పేర్ల లిస్టులో ఏమైనా అవకతవకలు ఉంటే వారం రోజుల్లోపు అభ్యంతరాలపై దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలియజేస్తూ గత శుక్రవారం ఆయా గ్రామపంచాయతీల్లో నోటీసు బోర్డులపై జాబితాను అంటించారు. అభ్యంతరాలకు సంబంధించి గడువు గురువారంతో ముగియనుంది. గడువు ముగిసిన తర్వాత అభ్యంతరాలుంటే మరో రెండు రోజులు పరిశీలన జరిపి డ్రా పద్ధతిన ప్లాట్ల నంబర్లు కేటాయించటానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం యాచారం మండలంలోని మేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద, తాటిపర్తి గ్రామాల్లో గతవారం రోజులుగా లిస్టులను ప్రదర్శించారు. అలాగే, కందుకూరు మండలంలోని మీర్‌ఖాన్‌పేట్, బేగరికంచ, పంజాగూడ, అన్నోజిగూడ, ముచ్చర్ల, సార్లరావులపల్లి, సాయిరెడ్డిగూడం గ్రామాల్లో భూములు కోల్పోయిన రైతులకు ఇండ్ల స్థలాలను కేటాయిస్తూ ఆయా గ్రామపంచాయతీల్లో రైతుల పేర్ల జాబితాను అందుబాటులో ఉంచారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా బాధిత రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం అందడంతో పాటు ఇంటి స్థలాలు కూడా అందుతున్నాయి. ఇంటికో ఉద్యోగం ఇస్తామన్న హామీని కూడా ప్రభుత్వం నెరవేర్చాలని రైతులు కోరుతున్నారు. యాచారం మండలంలో మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో మొత్తం 979 మంది రైతులు ఉన్నారు. కందుకూరు మండలంలో మీర్‌ఖాన్‌పేట్, బేగరికంచ, పంజాగూడ, అన్నోజిగూడ, సాయిరెడ్డిగూడ, ముచ్చర్ల, సార్లరావులపల్లి గ్రామాల్లో మొత్తం 868 మంది రైతులు ఉన్నారు.



రైతులకు అందజేయనున్న ప్లాట్లు..